సాక్షి పెద్దపల్లి

బుధవారం ׀ 20 ׀ సెప్టెంబర్ ׀ 2023

కొలువుదీరిన గణనాథులు



పాతబజార్ వద్ద



క్రిస్టియన్ కాలనీలో భక్తుల పూజలు



కమాన్‌వద్ద రాధాకృష్ణుల అవతారంలో ..



వైశ్యభవన్‌లో కలశాలతో అలంకరణ



సాగర్‌రోడ్‌లో వినాయకుడి మండపం



పెద్దపల్లి ప్రభుత్వ కళాశాల మైదానంలో కొలువైన 47 అడుగుల మట్టి గణనాథుడు

గణపతి బొప్ప మోరియా.. జైబోలో గణేశ్ మారాజ్‌కీ అంటూ భక్తి పారవశ్యం మధ్య నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఊరూరా..వాడవాడలా గణపతులను ప్రతిష్ఠించారు. కొందరు మట్టి విగ్రహాలను.. మరికొందరు విభిన్నరీతిలో రూపొందించిన వినాయకులను నెలకొల్పారు. పూజారులతో ప్రత్యేక పూజలు నిర్వహించి పరవశించిపోయారు. – పెద్దపల్లిరూరల్

న్యూస్‌రీల్

'సిమ్స్'లో బాయ్స్ హాస్టల్ ప్రారంభం



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని సిమ్స్‌లో కొత్తగా నిర్మించిన బాయ్స్ హాస్టల్‌ను సోమవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబింగ్ సింగ్ ప్రారంభించారు. స్థానిక బీగెస్ట్ హౌజ్ సమీపంలోని హాస్టల్‌లో ఉంటున్న 86 మంది విద్యార్థులను కొత్త హాస్టల్‌కు తరలించారు. మెడికల్ కాలేజీలో మొత్తం 400 మంది విద్యార్థులకుపైగా వసతి కల్పించడానికి ప్రత్యేకంగా హాస్టళ్లను నిర్మిస్తున్నారు. ఇందులోభాగంగా బాయ్స్ హాస్టల్‌ను ప్రారంభించారు. ప్రొఫెసర్లు అనంతబాబు, రాహుల్ పాల్గొన్నారు.

ఇకనుంచి మంథనిలోనూ ప్రజావాణి

పెద్దపల్లిరూరల్/మంథని: ఈనెల 25 నుంచి మంథనిలోని తహసీల్దార్ కార్యాలయంలోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లాకేంద్రంలో నిర్వహించే ప్రజావాణి అదనపు కలెక్టర్లు పాల్గొంటారని, మంథనిలో నిర్వహించే ప్రజావాణిలో తానే స్వయంగా పాల్గొంటానని వివరించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, మంథనిలో డివిజనల్ అధికారులు ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉండాలని సూచించారు. మంథని డివిజన్ పరిధిలోని గ్రామస్తులు తమ సమస్యలను మంథని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో అర్జీలు అందించాలని, దూరభారాన్ని తగ్గించుకోవాలని సూచించారు.

హిందీ భాష నేర్చుకోవాలి



మాట్లాడుతున్న జనరల్ మేనేజర్లు

జ్యోతినగర్: హిందీ భాషకు గొప్ప చరిత్ర ఉందని, ప్రతిఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు జనరల్ మేనేజర్లు అలోక్ చంద్రఠాకూర్, అతుల్ కమలాకర్ దేశాయ్ అన్నారు. సోమవారం హిందీ పక్షోత్సవాల సందర్భంగా పరిపాలనా భవనంలోని ఆడిటోరియంలో ఉద్యోగులకు నిర్వహించిన హిందీ నోటింగ్, డ్రాఫ్టింగ్ పోటీలను ప్రారంభించారు. హిందీ దేశ రాజభాష అని, ప్రాచీన గ్రంథాల్లో కూడా హిందీ ఉందని తెలిపారు. భాష ప్రాముఖ్యత, ప్రజాదరణ అసమానమైనదని అన్నారు. పోటీ పరీక్షల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అర్హులందరికీ గొర్రెల యూనిట్లు



బాలరాజును సత్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన గొల్ల, కుర్మలందరికీ మలివిడత గొర్రెలు అందిస్తుందని, లబ్ధిదారులు ఆందోళనపడాల్సిన అవసరం లేదని గొర్రెల మేకల పెంపకందారుల రాష్ట్ర సహకార అభివృద్ధి సమాఖ్య చైర్మన్ బాలరాజు అన్నారు. జిల్లాకేంద్రంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. గొర్రెల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి ఏడీఏ రవీందర్‌రెడ్డి నుంచి వివరాలు తెలుసుకున్నారు. బాలరాజును యాదవహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు పెగడ రమేశ్ ఆధ్వర్యంలో పలువురు సత్కరించారు. నాయకులు నర్ల అంజయ్య, బయ్య కొమురయ్య, మల్లేశ్, రాజయ్య, మేకల కిట్టు, నవీన్, మేకల కుమార్, రవి, గొడ్డేటి రాజన్న తదితరులున్నారు.

లీడర్లకు మహిళా బిల్లు టెన్షన్!



- ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాలు రిజర్వేషన్?
- నేతల సతీమణులు, కోడళ్లను తెరపైకి తెచ్చే యోచన
- అన్ని పార్టీల్లో ఆశావహుల ఆశలపై నీళ్లు
- 1951 నుంచి చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువే

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మహిళా బిల్లు ప్రస్తావన ప్రకంపనలు రేపుతోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే మన రాష్ట్రంలో ఎమ్మెల్యే ఆశావహులను జమిలీ ప్రకటన వెంటాడుతుండగానే మహిళా బిల్లు వార్త గుండెలపై పిడుగుపాటులా పడింది. మహిళా బిల్లుకు పార్లమెంటు ఆమోదం లాంఛనమైన వేళ ఈ చర్చ స్థానికంగా దుమారం రేపుతోంది. బిల్లు ఇప్పటికిప్పుడు అమల్లోకి వస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో ఏయే స్థానాలు రిజర్వేషన్ కిందకు వస్తాయి? అన్న లెక్కలు అప్పుడే మొదలయ్యాయి. అయితే, అదే సమయంలో మహిళా బిల్లును చూడకుండా అందులో పొందుపర్చిన అంశాలు అధ్యయనం చేయకుండా అప్పుడే నిర్ణయానికి రాలేమని సీనియర్ ఎమ్మెల్యేలు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ నోట్ల రద్దు తరహాలో ప్రభుత్వం ఇప్పటికిప్పుడు అమలు చేస్తే మాత్రం ఉమ్మడి జిల్లా రాజకీయాలపై పార్టీలకు అతీతంగా ప్రభావం చూపడం గ్యారెంటీ అని కుండబద్దలు కొడుతున్నారు. ఇది నియోజవకరాల పునర్విభజన తర్వాత ఉంటుందా? లేదా ఇప్పుడే అమలు చేస్తారా? అనే దానిపై స్పష్టత లేదు.

పాత జిల్లా పరిస్థితి ఇదీ

ఉద్యమాల జిల్లాగా పేరొందిన పాత కరీంనగర్ జిల్లా ప్రజలు ఓటు రూపంలో తీర్పులు ఇవ్వడంలోనూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మొత్తం మూడు పార్లమెంటు, 13 అసెంబ్లీ స్థానాలు ఉన్న పాత జిల్లాలో మహిళా రిజర్వేషన్ ఇప్పటికిప్పుడు అమలు చేయాల్సి వస్తే.. కనీసం నాలుగు సీట్లు కేటాయించాల్సి వస్తుంది. ఇప్పటికే మానకొండూరు, చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడు స్థానాలు. వీటికి అదనంగా మరో నాలుగు సీట్లను జనాభా దామాషాన మహిళలకు కేటాయించాల్సి వస్తుంది. అంటే.. మూడు ఎస్సీ, నాలుగు మహిళలకు కేటాయిస్తే ఆరు జనరల్ స్థానాలు అవుతాయి. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ పార్టీ 13 మంది అసెంబ్లీ స్థానాలకు 13 మంది అభ్యర్థులు పురుషులనే ప్రకటించింది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు బీజేపీ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా ఇంకా ఖరారు కాలేదు. బీఎస్పీ, ఏఐఎఫ్‌బీ నుంచి పోటీకి పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. మహిళా బిల్లు అనివార్యమైతే ఇప్పటికే బరిలో ఉన్న సిట్టింగ్‌లు, పోటీ చేయబోయే ఆశావహుల (దాదాపు 150 మంది)కు ఈ బిల్లును శరాఘాతంగా భావిస్తున్నారు.

1951 నుంచి తక్కువే..

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కరీంనగర్ జిల్లా నుంచి మహిళా ప్రాతినిధ్యం తక్కువే అని చెప్పాలి. దీనికి సామాజికంగా, రాజకీయంగా అనేక కారణాలు ఉన్నాయి. హైదరాబాద్ రాష్ట్రంలో 1951లో జరిగిన ఎన్నికల్లో సిరిసిల్ల నుంచి జేఎం రాజమణి దేవి (ఎస్‌సీఎఫ్) వేదికపై విజయం సాధించారు. తర్వాత 1972 నుస్తులాపూర్ నియోజకవర్గం నుంచి ప్రేమలతా దేవి (కాంగ్రెస్) విజయం సాధించారు. 1998లో విద్యాసాగర్‌రావు లోక్‌సభకు ఎన్నికవడంతో మెట్‌పల్లి అసెంబ్లీస్థానానికి రాజీనామా చేశారు. దీంతో కొమిరెడ్డి జ్యోతిదేవి (కాంగ్రెస్) మెట్‌పల్లి ఉపఎన్నికల్లో గెలిచారు. 1998, 1999 పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి ఎంపీగా డాక్టర్ సుగుణకుమారి రెండుసార్లు గెలిచారు. 2014లో చొప్పదండి నుంచి బొడిగె శోభ (టీఆర్ఎస్) ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం 33శాతం అమలు చేయాల్సి వస్తే ఈ లెక్కలన్నీ మారిపోతాయనడంలో సందేహం లేదు.

తెరపైకి సతీమణులు

మహిళా బిల్లు ఇప్పటికప్పుడు అమలు చేయాల్సి వచ్చినా.. మన నేతలు నిరుత్సాహపడినా.. పోటీకి వెనకడుగు వేయడం, నియోజకవర్గం మారడం వంటి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. ఒకవేళ మహిళా బిల్లు అమలు చేయాల్సి వస్తే తమ భార్యలు, కూతుళ్లు, కోడళ్లను రంగంలోకి దించాలని యోచిస్తున్నారు. మహిళా బిల్లు పార్టీలతో సంబంధం లేకుండా అమలు చేయాల్సిన అంశం కాబట్టి, దీని అమలు ప్రభావం అన్ని పార్టీల్లో ఉంటుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే తమ అభ్యర్థుల జాబితా ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ కూడా అభ్యర్థుల పేర్లు మార్చాల్సి రావొచ్చు. అలాగే, కాంగ్రెస్, బీజేపీలు కూడా బిల్లుకు అనుగుణంగా తమ జాబితాను రూపొందించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ పార్టీ నాయకుడైనా సరే తమకు కాకుంటే తమ ఇంట్లో ఆడవారికి ఇప్పించుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. తిరిగి గెలిచేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఈసారైనా అధికారంలోకి రావాలని ప్రతిపక్ష పార్టీలు గత పదేళ్లుగా నియోజకవర్గాల్లో రూ.కోట్లాది ఖర్చు చేశారు. తీరా మహిళా బిల్లు వారికి శరాఘాతంగా మారినా.. అమలు అనివార్యమైతే దానిని తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో తలమునకలయ్యారు.

సార్లు ఇది తగునా!

- హెచ్‌ఆర్‌ఏ కోసం స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం
- దంపతులిద్దరికీ వేర్వేరు స్థానాల్లో పోస్టింగులు
- స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల్లో చేరేందుకు అనాసక్తి
- నిబంధనలకు తూట్లు అంటూ నాన్‌స్పౌజ్ టీచర్ల ఆందోళన
- పాయింట్ల విషయంలో విద్యాశాఖ ఆదేశాలు బేఖాతరు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: గవర్నమెంట్ హెడ్ మాస్టర్(జీహెచ్‌ఎం) బదిలీల్లో అనేక వింతలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా స్పౌజ్ (దంపతులు) పాయింట్ల విషయంలో భార్యాభర్తలిద్దరూ ఒకేచోట పనిచేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని, పాయింట్లు దుర్వినియోగానికి గురై దంపతులిద్దరూ వేర్వేరు చోట్ల పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవడం కలకలం రేపుతోంది. స్పౌజ్ కేటగిరీ కింద కేటాయించిన పాయింట్లు దుర్వినియోగమవుతున్నాయని నాన్ స్పౌజ్ టీచర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం జిల్లా కేంద్రాల్లో ఉండాలని, అధిక హెచ్‌ఆర్‌ఏ వస్తుందని, కుటుంబ సభ్యులకు చేరువగా ఉంటామని, కాంప్లెక్స్ పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సి రావడం, భార్య/ భర్త కింద పనిచేయడం ఇబ్బందిగా భావించడం తదితర కారణాలతో ఒకేచోట పనిచేసేందుకు ఇష్టపడటం లేదు. కానీ, పాయింట్లను మాత్రం వాడుకుని తమకు నచ్చినచోటుకు బదిలీ అవుతున్నారు. వాస్తవానికి స్పౌజ్ కేటగిరీ పాయింట్లను దుర్వినియోగం చేయకూడదని బదిలీలకు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల డీఈవోలు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. అయినప్పటికీ.. కొందరు జీహెచ్‌ఎంలు వీటిని బేఖాతరు చేస్తూ.. తమకు నచ్చినచోటుకు బదిలీ అయ్యారు.

మచ్చుకు కొన్ని..

- ఓ మహిళా జీహెచ్‌ఎం భర్త హన్మకొండ జిల్లా పరకాల మండలంలో పనిచేస్తున్నారు. కానీ, సదరు మహిళా జీహెచ్‌ఎం పరకాల మండలంలో నాలుగు ఖాళీలు ఉండగా వాటిని వదిలి పక్కనే ఉన్న హనుమకొండ మండలానికి బదిలీ అయ్యారు.
- కరీంనగర్ అర్బన్‌లో భర్త పనిచేస్తుండగా.. లేడీ జీహెచ్‌ఎం మాత్రం పక్కనే ఉన్న రుక్మాపూర్‌ను వదిలి హుజూరాబాద్ మండలానికి బదిలీ అయ్యారు.
- పెద్దపల్లి జిల్లాలో జీహెచ్‌ఎం జమ్మికుంటలోని తన భార్య వద్దకు కాకుండా.. శంకరపట్నం మండలం తాడికల్‌ను ఎంచుకోవడం చర్చనీయాంశమైంది.
- పెద్దపల్లి జిల్లాలోని మరో జీహెచ్‌ఎం భార్య వీణవంక మండలంలో పనిచేస్తున్నారు. కానీ, ఈయన అదే మండలంలోని గంగారం స్కూల్‌ను కోరుకోకుండా, శంకరపట్నం మండలం కన్నాపూర్‌ను ఎంచుకున్నారు.
- జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలో ఓ మహిళా జీహెచ్‌ఎం భర్త అదే మండలంలో పనిచేస్తున్నారు. సదరు జీహెచ్‌ఎం ఆ మండలాన్ని వదిలి స్పౌజ్ పాయింట్ల సాయంతో మేడిపల్లి మండలం దమ్మన్నపేట ఎంచుకున్నారు.
- సిరిసిల్ల జిల్లాకు చెందిన జీహెచ్‌ఎం చొప్పదండి మండలంలో తన భార్య పనిచేస్తున్న పాఠశాలలో ఖాళీ ఉండగా.. దాన్ని వదులుకుని పక్క పాఠశాలకు బదిలీ అయ్యారు.

దరఖాస్తులో లేకున్నా.. ఆర్డర్‌లో ప్రత్యక్షం..

జమ్మికుంట మండలంలోని ఓ మహిళా జీహెచ్‌ఎం బదిలీ దరఖాస్తులో స్పౌజ్ పాయింట్లు వినియోగించుకోవడం లేదని ధ్రువీకరించింది. కానీ, బదిలీ ఆర్డర్‌లో మాత్రం స్పౌజ్ కేటగిరీలో 10 పాయింట్లు వినియోగించుకున్నట్లు చూపిస్తోంది. దీనివెనుక డీఈవో కార్యాలయ సిబ్బంది హస్తం ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ పథకాలు బీఆర్‌ఎస్‌ను కుప్పకూలుస్తాయ్

- సీడబ్ల్యూసీ సభ్యురాలు ఆల్కా లాంబ



ర్యాలీలో పాల్గొన్న సీడబ్ల్యూసీ సభ్యురాలు ఆల్కా లాంబ, రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలు బీఆర్‌ఎస్‌ను కుప్పకూలుస్తాయని ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యురాలు ఆల్కా లాంబ అన్నారు. సోమవారం గోదావరిఖనిలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్‌ను నమ్మి ప్రజలు అధికారం ఇస్తే పాలన వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజీవ్‌గాంధీ కలలుగన్న మహిళా బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

హామీ పథకాలు అమలు చేస్తాం: రాజ్‌ఠాగూర్

కాంగ్రెస్ ఇచ్చిన హామీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామని రాజ్‌ఠాకూర్ స్పష్టం చేశారు. స్థానిక విఠల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళకు నెలకు రూ.2500, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు సాయం, వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల సాయం, ఉద్యమకారులకు 250చదరపు గజాల ఇంటి స్థలం, విద్యార్థులకు రూ.ఐదు లక్షల విద్యాభరోసా, ఆసరా పెన్షన్ రూ.4వేలకు పెంచుతామని వివరించారు. సమావేశంలో మనాలిఠాకూర్, మహిళా నాయకులు శోభ, మాజీ కార్పొరేటర్ చుక్కల శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, రామ్‌కుమార్, రంజిత్ యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొట్టాలి



రామగుండం: గోలివాడ గ్రామంలో ప్రజా అంకితయాత్రలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: ఎన్నికల సమయంలో వచ్చే బీజేపీ, కాంగ్రెస్ నాయకుల కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. తిలక్‌నగర్‌లో నిర్వహించిన రాజన్నలసంఘం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తనకు పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవకే జీవితం అంకితమన్నారు. కలిసికట్టుగా ముందుకు సాగితేనే ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చన్నారు. రాజన్నల కులస్తుల అభివృద్ధి, సంక్షేమానికి సొసైటీలు ఏర్పాటు చేస్తామన్నారు. డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, నాయకులు కౌశిక హరి, ప్యాక్స్ చైర్మన్ మామిడాల ప్రభాకర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గణేశుడి ఆశీస్సులతో చల్లగా ఉండాలి

గోదావరిఖనిటౌన్: గణేశుడి ఆశీస్సులతో ప్రజలు చల్లగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక బస్‌స్టాండ్ ఆటో అడ్డాలో నెలకొల్పిన గణేశుడికి పూజలు చేశారు. పార్టీ నాయకులు ఎండీ. జాహిద్ పాషా, తానిపర్తి గోపాల్‌రావు, అచ్చె వేణు, కడార్ల శ్రీధర్, కలువల సంజీవ్, దేవీ లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

రామగుండం: బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. సోమవారం రాత్రి అంతర్గాం మండలం గోలివాడలో సర్పంచ్ ధర్ని రాజేష్ ఇంట్లో పల్లెనిద్ర చేశారు. మంగళవారం ఉదయం గ్రామంలో ప్రజా అంకితయాత్ర నిర్వహించారు. ఇంటింటా ఓటర్లను కలిసి రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు. ముందుగా రామాలయంలోని గణపతికి పూజలు చేశారు. గ్రామ శివారులోని ఓపెన్‌జిమ్‌ను ప్రారంభించారు. సర్పంచ్ రాజేశ్, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా గోలివాడకు చెందిన మాజీ కార్పొరేటర్ గుంపుల లక్ష్మి బీఆర్‌ఎస్‌లో చేరగా.. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

రాష్ట్రంలో బాగుపడింది కేసీఆర్ కుటుంబమే



మాట్లాడుతున్న రూబి మనోహరన్

సుల్తానాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే నీరుపేదలు బాగుపడుతారని అనుకుంటే ఒక్క సీఎం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని తమిళనాడులోని నంగునూరి ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి రూబి మనోహరన్ అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులను ప్రవేశపెట్టగా మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి మండలంలోని కాట్నపల్లిలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గెలిచాక పార్టీ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, నాయకులు ప్రకాష్‌రావు, చిలుక సతీశ్, దామోదర్‌రావు తదితరులు ఉన్నారు.

బాగా చదవాలి.. ఉన్నతంగా ఎదగాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో ముచ్చట



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: లక్ష్యాన్ని ఎంచుకుని.. కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని మంగళవారం సందర్శించారు. అకౌంట్స్ అండ్ టాక్సేషన్ గ్రూప్ విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాల బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. ఉన్నత విద్య చదివే విద్యార్థులు ఏకాగ్రతతో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు.

రూ.కోటితో జిల్లా గ్రంథాలయ భవనం

జిల్లాకేంద్రంలో గ్రంథాలయ భవనాన్ని రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. భవనం కోసం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో కేటాయించిన స్థలాన్ని డీఈఓ మాధవి, ఇంటర్ నోడల్ అధికారి కల్పన, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. అన్ని వసతులతో నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఈఈ గిరిశ్‌బాబు, డీఈఈ శంకరయ్య, ఏఈ రాజు తదితరులున్నారు.

క్లుప్తంగా

కవితను కలిసిన 'కెంగర్ల'


పుష్పగుచ్ఛం అందిస్తున్న కెంగర్ల మల్లయ్య

గోదావరిఖని: టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య మంగళవారం కలిశారు. మహిళా రిజర్వేషన్‌కు ఆమోదం పొందిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీ స్థాయిలో జరిగిన పోరాటం వల్లే రిజర్వేషన్ సాధ్యపడిందన్నారు.

కవితను కలిసిన జెడ్పీ చైర్మన్


కవితతో మధు

మంథని: జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించడంపై శుభాకాంక్షలు తెలిపారు.

కరాటే పోటీల్లో గాయత్రీ విద్యార్థులకు పతకాలు


విజేతలుగా నిలిచిన గాయత్రీ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకేంద్రంలోని గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారని గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. లయవర్ధిని, స్ఫూర్తి, హర్షిత, అవంతిక, నిత్యతేజశ్రీ బంగారు పతకాలు సాధించారని, అస్మిత, సాహితీ ప్రియ, విహిత, శ్రైతిక వెండి, నవనీత్, శ్రీలాస్య, హర్షిని, మహాలక్ష్మి కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. విద్యార్థులు, కరాటే మాస్టర్ రామస్వామిని కరస్పాండెంట్ రజనీ, ప్రి న్సిపాల్ విజయ్ తదితరులు అభినందించారు.

తొమ్మిదేళ్ల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను 9ఏళ్ల కాలంలో ఏ మేర అమలు చేశారో వివరిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి–మంథని మార్గంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించనున్నట్లు గౌడసంఘం నాయకుడు బండారి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ స్రవంతి తెలిపారు. కార్యక్రమానికి గౌడన్నలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య

- భూ వివాదాలే కారణమా..?
- నిందితుల కోసం పోలీసుల గాలింపు


లింగయ్య (ఫైల్)


హత్యకు ఉపయోగించిన వేట కొడవలి


హత్యకు గురైన మేకల లింగయ్య

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి, కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మేకల లింగయ్య సోమవారం రాత్రి దారుణహత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. లింగయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని సమస్యాత్మక భూములను కొంటూ.. వాటిని పరిష్కరించి.. విక్రయాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ భూమి విషయంలో లింగయ్యకు.. మరికొందరికి వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో లింగయ్య రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో పెంపుడు కుక్కతో ప్రధాన రహదారి నుంచి పవర్‌ప్లాంట్‌కు వెళ్లే దారిలో వాకింగ్ చేస్తున్నారు. అప్పటికే మాటువేసిన దుండగులు లింగయ్యపై వేట కొడవళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్, రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్, ఎన్టీపీసీ ఎస్సై జీవన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కృష్ణాష్టమి రోజే హత్యకు ప్లాన్..?

లింగయ్యను హత్య చేసేందుకు నిందితులు కృష్ణాష్టమి రోజే ప్రత్యర్థులు ప్రయత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. అనంతరం వినాయక చవితి పండుగ పూట రోడ్లపై ఎవరూ ఉండరని, హత్యకు అదే అనువైన సమయమని దుండగులు భావించినట్లు సమాచారం. సుమారు 12 రోజులపాటు గస్తీ నిర్వహించి.. వాకింగ్‌కు వెళ్లే సమయం అనుకూలమని నిందితులు నిర్ధారించుకుని పక్కా ప్లాన్ ప్రకారమే రాత్రి సమయంలో లింగయ్య వాకింగ్ చేస్తుండగా.. వేట కొడవళ్లతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేసినట్లు తెలుస్తోంది.

నాడు అన్న.. నేడు తమ్ముడు

ఖాజీపల్లికి చెందిన మేకల లింగయ్యతో కలిపి ఐదుగురు అన్నదమ్ములు. లింగయ్య అన్న రాజయ్య 1991 ఏప్రిల్ 4న పొలం పనులకు వెళ్లి ఇంటికొస్తుండగా ఇంటి సమీపంలోనే ప్రత్యర్థులు కత్తులతో దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేశారు. కుటుంబంలో చిన్నవాడైన మేకల లింగయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. తాజాగా అతడి హత్య జరిగిన 32 ఏళ్ల తర్వాత లింగయ్యను కూడా అలాగే హతమార్చడం స్థానికంగా సంచలనం సృష్టించింది.

పోలీస్ పహారా మధ్య ఖాజీపల్లి

లింగయ్య హత్యలో ఓ అనుమానితుడి ఇంటి ప్రహరీని లింగయ్య కుటుంబసభ్యులు కూల్చివేశారు. దీంతో ఖాజీపల్లిలో పోలీసులు భారీగా మోహరించారు. లింగయ్య అంత్యక్రియల సమయంలోనూ గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహారా కొనసాగించారు. డాగ్‌స్క్వాడ్‌తో దర్యాప్తు చేస్తున్నారు. భూ వివాదాలే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధితుడి కూతురు మేకల సుప్రజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితుల కోసం ప్రత్యేక బలగాలు గాలింపు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

రియల్టర్లలో గుబులు

జ్యోతినగర్: రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్యకు గురికావడంతో రామగుండం ప్రాంతంలోని వివాదాస్పద భూములు క్రయవిక్రయాలు చేస్తున్న రియల్టర్లలో గుబులు మొదలైంది. సమస్యాత్మక భూముల వ్యవహారంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాత్ర పోషిస్తున్న వారు వణుకుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని ఖాజీపల్లె, మాతంగి కాలనీ, ప్రగతినగర్, కృష్ణానగర్, జంగాలపల్లె, మల్యాపూర్ శివారులోని కొన్ని వివాదాస్పద భూముల వ్యవహారం కొన్నాళ్లుగా కొనసాగుతోంది.

భూములు అమ్మాలన్నా.. కొనాలన్నా వీరి కనుసన్నల్లోనే

గోదావరిఖని ప్రాంతంలో ఇళ్లస్థలాలు లేకపోవడం.. ఎన్టీపీసీ పరిధిలో స్థలాలు ఉండడం రియల్టర్లకు వ్యాపారకేంద్రంగా మారింది. ఇందిరమ్మకాలనీ ప్రాంతంలో ప్రభుత్వ భూమితోపాటు సింగరేణి సంస్థ రోడ్డు కోసం కేటాయించిన భూమిని సైతం కొంత మంది యథేచ్ఛగా విక్రయిస్తుండడం బహిరంగంగానే కొనసాగుతోంది. ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూములను ఆక్రమించడం.. లేకుంటే తక్కువ ధరకు కొనుగోలు చేసి సెటిల్‌మెంట్ దందాతో అధిక మొత్తానికి విక్రయించడం ఇక్కడ మామూలు విషయంగానే చెప్పుకుంటున్నారు. రియల్ వ్యాపారి మేకల లింగయ్య హత్యతో ఈ ప్రాంతంలో హైఅలర్ట్ చేసిన పోలీసులు గస్తీ చేపడతున్నారు. నిందితులను పట్టుకునేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాలకుర్తి: బసంత్‌నగర్ ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కృష్ణమూర్తి తెలిపారు. ఇటీవల ఎన్టీపీసీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ప్రిన్స్‌కుమార్‌రాయ్ 100మీటర్ల రన్నింగ్‌లో, శరత్‌కుమార్ 400మీటర్ల రన్నింగ్‌లో గోల్డ్‌మెడల్, తన్వీర్‌బాబా జావెలిన్ త్రోలో, షాట్‌పుట్ త్రోలో, అనుషలిక 600 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ మెడల్స్ సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేంద్రన్ విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మహేంద్రన్

పేదలకు అండగా కాంగ్రెస్

- ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు
- గ్యారంటీ పథకాలపై జీడీనగర్‌లో ప్రచారం


మహిళలకు పథకాలు వివరిస్తున్న శ్రీధర్‌బాబు

పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని, రానున్న ఎన్నికల్లో గెలిపించి అధికారంలోకి తేవాలని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ తుక్కుగూడ బహిరంగ సభలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను మండలంలోని జీడీనగర్‌లో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముందుగా వినాయక మంటపంలో ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళకు నెలకు రూ.2500 చొప్పున నగదు, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతుభరోసా ద్వారా కౌలురైతులకు ఏటా రూ.15వేల పెట్టుబడి సాయం, వ్యవసాయకూలీలకు ఏటా రూ.12వేల సాయం, వరికి రూ.500 బోనస్ చెల్లిస్తామని అన్నారు. సర్పంచ్ సూర సమ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మంథని అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం, బామ్లానాయక్‌తండా సర్పంచ్ బదావత్ రాజునాయక్, కేశోరాం కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య, నాయకులు సూర సంతోష్, బాలసాని కుమార్, జెమినిగౌడ్, భూతగడ్డల రమేశ్, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


తమ్మడవేని లచ్చయ్య (ఫైల్)

ధర్మారం: మండలంలోని ఎర్రగుంటపల్లి శివారు దుర్గామాత ఆలయం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన తమ్మడవేని లచ్చయ్య (50) దుర్మరణం పాలయ్యారు. లచ్చయ్య జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి వారసంతలో మేకలు కొనుగోలు కోసం వెళ్లాడు. తిరిగి ద్విచక్రవాహనంపై కొత్తూరు గ్రామానికి వస్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో లచ్చయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మృతి

- ఎదురెదురుగా ఢీకొన్న వాహనాలు
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారంలో ఘటన


సంఘటనస్థలం వద్ద వాహనాలు

గోదావరిఖని/కాటారం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలం మేడిపల్లి అటవీప్రాంతంలో మంగళవారం రాత్రి రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొని గోదావరిఖనిలోని విఠల్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు నర్సయ్య (60) మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. విఠల్‌నగర్‌కు చెందిన బొంకూరి నర్సయ్య కుటుంబసభ్యులతో కలిసి కారులో (ఎర్టిగా) జయశంకర్‌భూపాలపల్లి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో మహదేవపూర్‌కు చెందిన బాబోద్దీన్, హజీం, మహమ్మద్ మార్ద్, మరొకరు బొలేరో వాహనంలో భూపాలపల్లి నుంచి మహదేవపూర్ వైపు వస్తున్నారు. మేడిపల్లి అటవీప్రాంతంలోకి రాగానే వాహనాన్ని తప్పించబోయి ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నర్సయ్య, శ్రీకాంత్‌తోపాటు మరొకరు, బొలేరోలో ఉన్న మహదేవపూర్‌కు చెందిన బాబోద్దీన్, హజీం, మహమ్మద్ మార్ద్, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను భూపాలపల్లిలోని సింగరేణి, సివిల్ ఆస్పత్రులకు తరలించారు. నర్సయ్య చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు.

డెంగీతో బాలుడి మృతి


బెక్క అక్షిత్ (ఫైల్)

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్‌కు చెందిన బెక్కం అక్షిత్ (13) డెంగీతో మృతిచెందాడు. ఆయన కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. వర్షిత్‌కు ఈనెల 12 జ్వరం రావడంతో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు రెండురోజులు చికిత్స అందించారు. 14న మరోసారి పరీక్షించగా.. డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. 18న ఉదయం రక్తకణాలు పడిపోవడంతో అదే రాత్రి కరీంనగర్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. అయితే గుండెపోటుతోపాటు రక్తం గడ్డకట్టుకుపోవడంతో చనిపోయినట్లు డిశ్చార్జి రిపోర్టులో పేర్కొన్నారని తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వర్షిత్ మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. అక్షిత్ కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. ఎమ్మెల్యే డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే అక్షిత్ చనిపోయాడని, విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మక్కాన్‌సింగ్ డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు క్లర్కుల నియామకాన్ని రద్దు చేయాలి

గోదావరిఖని: సింగరేణిలో కాంట్రాక్టు క్లర్కుల నియామకాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సింగరేణిభవన్‌లో ఫైనాన్స్, మార్కెటింగ్, పర్చేజ్ విభాగాల్లో పనిచేసేందుకు కాంట్రాక్టు పద్ధతిన తీసుకునేందుకు కంపెనీ టెండర్లు ఆహ్వానించిందని, దీన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎల్లాగౌడ్, కె.స్వామి, గోవర్ధన్, కనకరాజు, మల్లయ్య, మద్దెల దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపల్లి విద్యార్థికి అక్షరయాన్ పురస్కారం


విద్యార్థి లక్ష్మీగణేశ్

ధర్మారం: మండలంలోని నర్సింహులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బొట్ల లక్ష్మీగణేశ్ అక్షరయాన్ పురస్కారానికి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కర్ తెలిపారు. అక్షరయాన్ తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్ వారు ఏటా సాహిత్యంలో వివిధ విభాగాల్లో ఇచ్చే 2023కు గాను బాల రచయిత బాలుర విభాగంలో లక్ష్మీగణేశ్ ఎంపికైనట్లు భాస్కర్ తెలిపారు. 23న పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో లక్ష్మీగణేశ్‌కు నగదుతోపాటు జ్ఞాపిక అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం అజ్మీరా రమేశ్‌నాయక్, ప్రముఖ బాలసాహిత్యవేత్త గరిపెల్లి అశోక్, సర్పంచ్ అడువాల అరుణజ్యోతి, ఉపసర్పంచు కత్తెర్ల కోమలత, ఎంపీటీసీ సదయ్య, విద్యాకమిటీ చైర్మన్ రాయమల్లు విద్యార్థిని అభినందించారు.

బొగ్గుబాయి వార్తలు

జీవో 22 అమలు చేయాలి


మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం 22 జీవోను గెజిట్ చేసి సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీ సివిక్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని 2016లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని వాపోయారు. కోల్ ఇండియాలో మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని కోరారు. సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కట్టుబానిసలుగా చూస్తోందని ఆరోపించారు. ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్లక్క, నరేష్, సులోచన, పద్మ, మల్లేశ్, సాగర్, ప్రకాశ్, రమేశ్, శారద, రాజేశ్వరి, కమల, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాక్టింగ్ క్లర్క్‌లను రెగ్యులరైజ్ చేయాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.క్రిష్ణ


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న యాక్టింగ్ క్లర్క్‌లను రెగ్యులరైజ్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.క్రిష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. పర్మినెంట్ క్లర్కుల కన్నా యాక్టింగ్ క్లర్కులే అధిక శ్రమచేస్తూ సంస్థ పురోభివృద్ధికి పాలుపడుతున్నారని పేర్కొన్నారు. పేరుకే పర్మినెంట్ ఉద్యోగమని, చేస్తున్న పని వెట్టిచాకిరీని తలపిస్తోందని తెలిపారు. నాయకులు నరేశ్, ఎస్.మల్లేశ్, ఎం.దుర్గయ్య, కొండ్ర మొగిలి పాల్గొన్నారు.

కవిత కృషితోనే మహిళా బిల్లు


క్షీరాభిషేకం చేస్తున్న జీఎం కార్యాలయం మహిళలు

గోదావరిఖని: టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత కృషితోనే మహిళకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారని టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ చిప్ప సత్యనారాయణ తెలిపారు. జీఎం కార్యాలయం ఆవరణలో మంగళవారం కవిత ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. మహిళా బిల్లు కోసం ఏళ్లతరబడి పోరాటాలు చేస్తున్నారని, కల్వకుంట్ల కవిత ఎంపీగా గెలిచాక మహిళలకు అన్నిరంగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని పార్లమెంట్‌లో పోరాడారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు శ్రీలక్ష్మి, దివ్య, భవిత, ఉమ, జయ, సమత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంస్థ ఉన్నత శిఖరాలకు చేరాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న చింతల శ్రీనివాస్

గోదావరిఖని: సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో జీఎం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా ఉద్యోగులందరూ సంపూర్ణ ఆయురారోగ్యాలతో పనిచేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో అధికారులు ఆంజనేయప్రసాద్, రాజం, ధనలక్ష్మిబాయి, మాధవి, దేవాచారి, సత్యనారాయణ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

గోదావరిఖని: డిపార్ట్‌మెంట్ స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలు మంగళవారం ఆర్జీ–1 ఏరియాలో ప్రారంభమయ్యాయి. ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి కోలిండియాస్థాయిలో సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, అధికారులు సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేశ్, కో–ఆర్డినేటర్ రాజయ్య పాల్గొన్నారు.

హెల్త్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు

రామగిరి: సీపీఆర్‌ఎంఎస్‌కు సంబంధించిన మెడికల్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారు దరఖాస్తులను 2023 డిసెంబర్ 31లోపు తమ గనులు, డిపార్ట్‌మెంట్‌లో సమర్పించాలని సూచించారు. పథకం ద్వారా రూ.40వేలు చెల్లించి సభ్యత్వం తీసుకునే సదుపాయం ఉందని, పథకంలో చేరడం ద్వారా విశ్రాంత ఉద్యోగికి.. అతని జీవిత భాగస్వామికి కంపెనీతో ఒప్పందం చేసుకున్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.8లక్షల వరకు నగదురహిత ఆరోగ్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ విజయవంతం చేయాలి

- ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ–2 జీఎం, పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ విజయవంతం చేయాలని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ కోరారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ కొనసాగుతుందన్నారు. రెండు దశల్లో కార్యక్రమం ఉంటుందని, ఈనెల 30 వరకు సన్నాహక దశ, వచ్చేనెల రెండో తేదీ నుంచి 31వరకు రెండో దశ ఉంటుందని తెలిపారు. పరిశుభ్రత ప్రచారసైట్ల గుర్తింపు, కార్యాలయాల సుందరీకరణకు ప్రణాళిక, అనవసరమైన వస్తువులను గుర్తించడం, రికార్డ్ మేనేజ్‌మెంట్ తదితర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, రక్షణ అధికారి బి.రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు విధులకు హాజరుకావాలి


మాట్లాడుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి: ఉద్యోగులు విధులకు తప్పకుండా హాజరుకావాలని ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు అన్నారు. విధులకు గైర్హాజరవుతున్న ఆర్జీ–3 పరిధి ఏపీఏ సూపర్‌వైజర్లకు మంగళవారం జీఎం కార్యాలయం సమావేశమందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. విధులకు హాజరుకావడం ద్వారా కలిగే ప్రయోజనాలను కార్మికులకు వివరించారు. చిన్న చిన్న కారణాలతో విధులకు గైర్హాజరైతే వేతనాలు కోల్పోవడంతోపాటు ఉత్పత్తిపరంగా సంస్థకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత, అనారోగ్య సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ఎస్‌ఓటూ జీఎం డీ.బైద్య, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డీవైపీఎం హరీశ్, సీనియర్ పీవోలు మతిన్ హుస్సేన్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.